

ఘనంగా భోగి పండుగ

సంప్రదాయరీతిలో సందడిగా జరుపుకున్న ప్రజలు

భోగి పండుగను జిల్లా ప్రజలు ఆదివారం సంప్రదాయరీతిలో ఘనంగా జరుపుకు న్నారు. వీధుల్లో తెల్లవారుజామునే కట్టెలు, కర్రలతో భోగి మంటలు వేశారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు భోగి మంటల వద్ద సందడి చేశారు. పేడ పిడకలు, ఇళ్లల్లో వున్న పాత సామగ్రిని మంటల్లో వేసి దహనం చేశారు. మహిళలు ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి పూలతో అలంకరించారు. వీధుల్లో డూడూబసవన్నల సన్నాయి పాటలు, హరిదాసుల కీర్తనలు, సంప్రదాయ కళాకారుల తప్పెటగుళ్లు, మహిళల కోలాటాలతో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు బొమ్మల కొలువులు ఏర్పాటు చేసి, చిన్నారులకు భోగి పళ్లు పోశారు. బంధువులు, కొత్త అల్లుళ్లతో ఇళ్లల్లో సందడి నెలకొంది. మహిళలు రకరకాల పిండివంటలు తయారు చేశారు. పలు గ్రామాల్లో ఎడ్ల పరుగు పందేలు నిర్వహించే విజేతలకు బహుమతులు అందజేశారు.


చోడవరం మండలం గోవాడలో భోగి వేడుకలు నిర్వహిస్తున్న గ్రామస్థులు

కన్నుల పండువగా గోదాదేవి కల్యాణం


గోదాదేవి, రంగనాథుల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ధనుర్మాసోత్సవాల్లో భాగంగా నక్కపల్లి మండలం ఉపమాక క్షేత్రంలో ఆదివారం మధ్యాహ్నం గోదాదేవి, శ్రీరంగనాథుడి కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయా నికి ఆనుకుని వున్న స్వామివారి పుష్పతోటలో ఆలయ ప్రధానార్చకుడు గొట్టుముక్కల ప్రసాద్ ఆధ్వర్యంలో పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం కల్యాణ వేడుకలను వైభవంగా జరిపారు. అనంతరం పుణ్యకోటి వాహనంపై స్వామివారు, ఇత్తడి శేష వాహనంపై గోదాదేవి అమ్మవారిని అలంకరించి మాఢవీధుల్లో ఊరేగించారు. కనుమ పండుగ రోజైన మంగళవారం ఉపమాక వేంకటేశ్వరస్వామి గిరిప్రదక్షిణోత్సవం జరుగుతుంది.

27న గవరపాలెం గౌరీ పరమేశ్వరుల జాతర


గవరపాలెం గౌరీ పరమేశ్వరులు

అనకాపల్లి గవరపాలెం గౌరీ పరమేశ్వరుల జాతర మహోత్సవాన్ని ఈ నెల 27వ తేదీన నిర్వహించాలని నిర్ణయించినట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావునాయుడు చెప్పారు. ఆదివారం సాయంత్రం సతకంపట్టులో ఉత్సవ కమిటీ ప్రతినిధులతో కలిసి పోస్టర్లను విడుదల చేశారు. ఈ నెల 24వ తేదీ ఉదయం గౌరీ పరమేశ్వ రుల కల్యాణోత్సవం, అదే రోజు మధ్యాహ్నం అమ్మవారికి సారె ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. 27వ తేదీ తెల్లవారుజామున గౌరీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తామని వెల్లడించారు. అదే రోజు రాత్రి పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు వుంటాయన్నారు.

- వార్త 7వ పేజీలో

గోవాడ-చోడవరం మధ్య ట్రాఫిక్ కష్టాలు

ఇరుకు రోడ్డు, గోతులతో వాహనదారుల ఇక్కట్లు

- చెరకు క్రషింగ్ సీజన్‌లో సమస్య మరింత జటిలం
- పరిమితికి మించి చెరకు రవాణాతో బోల్తా పడుతున్న వాహనాలు
- గంటల తరబడి స్తంభిస్తున్న ట్రాఫిక్
- అంబులెన్సులు సైతం ముందుకు వెళ్లలేని పరిస్థితి
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- నత్తనడకన బీఎన్ రోడ్డు విస్తరణ, అభివృద్ధి

చోడవరం, జనవరి 14:
గోవాడ చక్కెర ఫ్యాక్టరీలో చెరకు క్రషింగ్ సీజన్ ప్రారంభం కావడంతో చోడవరం- గోవాడ మార్గంలో ప్రయాణించే వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు మొదలయ్యాయి. వాహనాల్లో పరిమితికి మించి చెరకు లోడింగ్ చేయడం, రోడ్డు మొత్తం గోతులమయం కావడం.. ఈ రెండు కారణాల వల్ల ఫ్యాక్టరీకి చెరకు తీసుకువచ్చే క్రమంలో వాహనాలు బోల్తా పడుతున్నాయి. దీంతో గోవాడ- చోడవరం మధ్య ట్రాఫిక్ స్తంభించడం నిత్యకృత్యంగా మారింది.

మూడు జిల్లాల ప్రజల రాకపోలకు ప్రధాన రహదారి అయిన భీమునిపట్నం- నర్సీపట్నం (బీఎన్) రోడ్డులో వాహనాల రాకపోకలు అధికంగా వుంటాయి.


పరిమితికి మించి చెరకు రవాణా చేస్తున్న వాహనం

ఏటేటా పెరుగున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా రహదారిని విస్తరించకపోవడం, అభివృద్ధి పనులు చేపట్టక పోవడంతో గోతులతో అధ్వానంగా తయారై వాహన దారులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా విశాఖ, అనకాపల్లి వైపు నుంచి వచ్చే రహదారులు కలిసే వెంకన్నపాలెం జంక్షన్ నుంచి గోవాడ మీదుగా చోడవరం పట్టణం దాటే వరకు ట్రాఫిక్ విపరీతంగా వుంటుంది. పైగా వెంకన్నపాలెం నుంచి చోడవరం వరకు రహదారి తక్కువ వెడల్పు వుండడంతో ఎక్కడో ఒకచోట తరచూ ట్రాఫిక్ స్తంభిస్తున్నది. లారీ, బస్సు వంటి పెద్ద వాహనాలు మరమ్మతులకు గురై రోడ్డు మధ్యలో ఆగిపోతే పరిస్థితి ఇబ్బందికరంగా మారుతుంది. ఇటువంటి తరుణంలో గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో క్రషింగ్ సీజన్ మొదలు కావడం, 24 గంటలూ చెరకు లోడుతో వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో సమస్య మరింత జటిలమైంది. వాహనం పరిమితికి మించి చెరకును లోడింగ్ చేసి ఫ్యాక్టరీకి తీసుకెళ్లే క్రమంలో రోడ్డుపై ఏర్పడిన భారీ గోతుల కారణంగా బోల్తా పడుతున్నాయి. కొన్నిసార్లు వాహనంలో నుంచి కొంత చెరుకు జారిపోయి రోడ్డుపై పడుతున్నది. దీంతో గంటల తరబడి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాక పరిమితికి మించి చెరకు రవాణా చేసే వాహనాలు నెమ్మదిగా వెళుతుండడం, కల్వర్టుల వద్ద వాహనాలు ఎదురైతే తప్పుకునే వెసులుబాటు లేకపోవడం, రోడ్డు చిన్నది వుండి వెనుక వచ్చే వాహనాలు ఓవర్ టేక్ చేయడానికి వీలుకపోవడంతో ఆయా వాహనాలు స్లోగా వెళ్లాల్సి వస్తున్నది. వెంకన్నపాలెం జంక్షన్ నుంచి చోడవరం పట్టణం దాటడానికి కొన్నిసార్లు గంటకుపైగా సమయం పడుతున్నదని వాహనదారులు వాపోతున్నారు. చోడవరం, బుచ్చెయ్యపేట, మాడుగుల మండలాలతోపాటు ఏజెన్సీ నుంచి అత్యవసర వైద్య సేవల కోసం రోగులను, రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారిని విశాఖ తరలించే అంబులెన్స్‌లు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నాయి. దీంతో సకాలంలో వైద్యం అందక ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడుతున్నది. వెంకన్నపాలెం నుంచి చోడవరం శివారు వరకు రహ దారిని వెడల్పు చేయడంతో పాటు శిథిలావస్థకు చేరిన కల్వర్టులకు మరమ్మతులు ... మిగతా 8వ పేజీలో


గోవాడ- గజపతినగరం మధ్య నిలిచిపోయిన వాహనాలు

భోగి మంటల్లో ప్రజా వ్యతిరేక జీవోలు


కశింకోట మండలం తీడలో వైసీపీ ప్రభుత్వ చీకటి జీవోల కాపీలను భోగిమంటల్లో వేస్తున్న అయ్యన్నపాత్రుడు, పీలా గోవింద సత్యనారాయణ, దాడి రత్నాకర్, తదితరులు

వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ పలు రకాల జీవోలను జారీచేస్తున్నదని తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్త చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజా, రైతు వ్యతిరేక జీవో ప్రతులను భోగిమంటల్లో వేసి నిరసన తెలిపారు. కశింకోట మండలం తీడ గ్రామంలో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద, సీనియర్ నాయకుడు దాడి రత్నాకర్, పరవాడ మండలం వెన్నెలపాలెంలో మాజీ మంత్రి బండారు స త్యనారాయణమూర్తి, బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో చోడవరం నియోజకవ ర్గం టీడీపీ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, చీడికాడ మండలం జి.కొత్తపల్లిలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, మాకవరపాలెం మండలం లచ్చన్నపా లెంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, నక్కపల్లిలో తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, ఎలమంచిలి, పూడిమడక, మునగపాల్లో ఎలమంచిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు జీవో ప్రతులను భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు.

34వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె ఆదివారానికి 34వ రోజుకు చేరింది. భోగి పండగను పురస్కరించుకుని ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఎస్మా జీవో ప్రతులు, షోకాజ్ నోటీ సులను మంటల్లో వేసి దహనం చేశారు. సమస్యలు పరిష్కరించాలని శాంతియుతంగా సమ్మె చేస్తున్న తమపట్ల ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లు ఆమోదించే వరకు సమ్మె విరమించబోమని స్పష్టం చేశారు. సీఎం డౌన్ డౌన్ అంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.


సబ్బవరంలో షోకాజ్ నోటీసులను భోగి మంటల్లో వేస్తున్న అంగన్‌వాడీలు

దుగ్గాడ కాలువపై నిర్లక్ష్యం

ధ్వంసమైన మదుములు, పాడైన గేట్లు

- కాలువల్లో పేరుకుపోయిన పూడిక
- పొలాలకు నీరు సరిగా అందక ఇబ్బంది పడుతున్న రైతులు
- ఐదేళ్ల నుంచి ప్రతిపాదనలకే పరిమితమైన నిధులు మంజూరు

నర్సీపట్నం, జనవరి 14:
రెండు మండలాల్లో సుమారు రెండు వేల ఎకరాలకు నీరు అందించే దుగ్గాడ ఆనకట్ట కాలువలు, మదుముల నిర్వహణను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసింది. కాలువల్లో పూడిక పేరుకుపోవడంతోపాటు గేట్లు పాడైపోవడంతో నీరు వృథాగా పోతున్నది. గేట్లకు మరమ్మతులు, కాలువల్లో పూడిక తీత పనులకు నిధులు మంజూరు ఐదేళ్ల నుంచి ప్రతిపాదనలకే పరిమితం అవుతున్నది. దీంతో పొలాలకు నీరు సక్రమంగా చేరక ఇబ్బంది పడుతున్నామని ఆయకట్టు రైతులు వాపోతున్నారు.

వరహా నదిపై నర్సీపట్నం మండలం దుగ్గాడ వద్ద ఆనకట్ట వుంది. నర్సీపట్నం మండలంలోని దుగ్గాడ, వేములపూడి, కోటవురట్ల మండలం అన్నవరం, జల్లూరు, సుంకపూరు, తం గేడు, బాపిరాజు కొత్తపల్లిలో 1,924 ఎకరాల ఆయకట్టు ఉంది. మెరక ప్రాంతాల్లో ఉన్న భూములకు కూడా నీరు అందించాలన్న ఉద్దేశంతో కాలువపై 12 చోట్ల మదుములు నిర్మించి గేట్లు అమర్చారు. సాధారణంగా గేట్లతోపాటు కాలువల్లో ఏటా మరమ్మతులు, నిర్వహణ పనులు చేపడుతుంటారు. కానీ ఐదేళ్ల నుంచి ఎటువంటి పనులు చేయకపోవడంతో వేములపూడి, అన్నవరం, బాపిరాజు కొత్త పల్లిలో ఆరు గేట్లు తుప్పుపట్టి పాడయ్యాయి. దీంతో నీరు వృథాగా పోతున్నది. మరోవైపు కాలువలో తుప్పలు పెరిగిపోయి, పూడిక పేరుకు పోయింది. దీనివల్ల పొలాలకు సాగునీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు. గేట్లు మరమ్మతుకు రూ.10 లక్షలతో జలవనరుల శాఖ అధికారులు ప్రతిపాదనలు పెట్టినప్పటికీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. మదుములు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. జలవనరుల శాఖ ఏఈ రవి కుమార్‌ని వివర ణ కోరగా, ఉపాధి హామీ పథకం కింద కాలువలో పూడికతీత పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. గేట్లు మరమ్మతుకు రూ.10 లక్షలతో ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపామని తెలిపారు.


కాలువలో పేరుకుపోయిన పూడిక


కోటవురట్ల మండలం అన్నవరం వద్ద పాడైన మదుము గేట్లు

ఏయూ వీసీ పోస్టుపై వీడని సస్పెన్స్

సెర్చ్ కమిటీ నివేదిక సమర్పించినా తేలని వైనం

- ఇప్పటికీ ముఖ్యమంత్రి కార్యాలయంలో ఫైల్ పెండింగ్
- సంక్రాంతి తరువాత తేల్చే అవకాశం
- వైసీపీ విశాఖ ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీ పేరుతో మారిన సమీకరణాలు
- తాజా మాజీ వీసీ అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న మంత్రి బొత్స


బొత్స సత్యనారాయణ


ప్రసాదరెడ్డి

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)
ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ పోస్టు భర్తీపై సస్పెన్స్ కొనసాగుతోంది. గత నెలాఖరులోనే కొత్త వీసీ బాధ్యతలు తీసుకుంటారని ఏయూలో పెద్దఎత్తున ప్రచారం జరిగింది. అయినప్పటికీ ప్రక్రియ ముందుకు సాగ లేదు. తాజా మాజీ వీసీ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాదరెడ్డి పదవీకాలం గత ఏడాది నవంబరు 24న ముగిసింది. ఆ స్థానంలో రెక్టార్ ప్రొఫెసర్ కె.సమతకు ప్రభుత్వం ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించింది. అప్పటికే వీసీ ఎంపికకు వీలుగా సెర్చ్ కమిటీ నియామకం కూడా చేపట్టింది. ఆ కమిటీ రెండు పర్యాయాలు సమావేశమై ముగ్గురు పేర్లతో నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేది చింది. దీంతో డిసెంబరులోనే కొత్త వీసీ బాధ్యతలు చేపడ తారని వర్సిటీ వర్గాలు భావించాయి. అయితే అనేక కార ణాలతో ఈ ప్రక్రియ ఆలస్యమవుతూ వస్తోంది. అంతేకా కుండా సెర్చ్ కమిటీ ఇచ్చిన నివేదిక ఇప్పటికీ ముఖ్య మంత్రి కార్యాలయంలోనే పెండింగ్‌లో ఉందని చెబుతు న్నారు. కమిటీ నివేదికలో తాజా మాజీ వీసీ ప్రసాదరెడ్డి, మాజీ రిజిస్ట్రార్, ప్రస్తుత ఓఎస్‌డీ కృష్ణమోహన్, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ రామ్మోహనరావు పేర్లు ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈ ముగ్గురూ ఎవరి మార్గాల్లో వారు తమ ప్రయత్నాలను ముమ్మరం చేయడం ప్రచారానికి ఊతమిచ్చింది. మాజీ వీసీ ప్రసాదరెడ్డి ఇప్పటికే ఉమ్మడి జిల్లా వైసీపీ సమన్వ యకర్త వైవీ సుబ్బారెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఇతర ముఖ్య నేతలను ప్రసన్నం చేసుకుని, మళ్లీ వీసీగా వచ్చేందుకు తీవ్రంగా యత్నిస్తున్నారని సమా చారం. మరో వైపు ఉన్నత విద్యా మండలి వైస్‌చైర్మన్ రామ్మోహనరావు తనకున్న రాజకీయ పరిచయాలతో ప్రయత్నాలు సాగిస్తున్నట్టు తెలిసింది.

ఝాన్సీ రాకతో మారిన పరిణామాలు..

కాగా వీసీ ఎంపికలో తాజాగా ఆసక్తికరమైన పరిణామం చోటుచేసుకుంది. సెర్చ్ కమిటీ ముగ్గురి పేర్లతో ప్రభుత్వానికి అందించిన నివేదికలో ఒకరి పేరును ఆదినుంచీ మంత్రి బొత్స సత్యనారాయణ తీవ్రంగా వ్యతిరే కిస్తున్నారు. ఇప్పుడు ఆయన సతీమణి ఝాన్సీలక్ష్మిని విశాఖ ఎంపీ అభ్యర్థిగా వైసీపీ అధిష్ఠానం ఖరారు చేసింది. ఇదే ఇప్పుడు మాజీ వీసీకి ఇబ్బందికరంగా పరిణమిం చిందని చెబుతున్నారు. తాజా మాజీ వీసీకి మళ్లీ అవకాశం కల్పిస్తే రాజకీయంగా ఇబ్బందులు ఎదురవుతాయని మంత్రి ... మిగతా 8వ పేజీలో

పండగపూట విషాదం

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి

- చోడవరం మండలంలో బైక్ ఢీకొని రైతు దుర్మరణం
- అనకాపల్లి తోటాడ జంక్షన్ వద్ద కారు ఢీకొని విజయనగరం వాసి మృతి
- చెట్టుపల్లి సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి ఒకరు..
- అనకాపల్లిలో రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి


చోడవరం మండలం గజపతినగరం సమీపంలో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన చందక సన్యాసిరావు. రోదిస్తున్న భార్య

భోగి పండుగ రోజు జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం జరిగిన ప్రమాదాల్లో నలుగురు వ్యక్తులు మృతిచెందారు. చోడవరం మండ లం గజపతినగరం సమీపంలో చెరకు మోసులతో బైక్‌పై వస్తున్న రైతును ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొనడంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. అనకాపల్లిలో జాతీయ రహదారిపై తోటాడ జంక్షన్ వద్ద రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. నర్సీపట్నం మండలం చెట్టుపల్లి సమీ పంలో బైక్ అదుపుతప్పి ఇటుకల బట్టీ కార్మికుడు చనిపోయాడు. అనకాపల్లిలో శారదా నది రైల్వే బ్రిడ్జి వద్ద రైలు ఢీకొనడంతో గుర్తు తెలియని వృద్ధుడు మృతిచెందాడు.

-వివరాలు 7 పేజీలో

జగనాసుర పాలనకు చరమగీతం పాడుదాం

మాజీ మంత్రి బండారు పిలుపు

పరవాడ, జనవరి 14: రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న జగనాసుర పాలనకు చరమగీతం పాడుదామని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం వెన్నెలపాలెంలో వేసిన భోగిమంట వద్ద ఆయన టీడీపీ శ్రేణులతో కలిసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజా వ్యతిరేక జీవో ప్రతులను మంటలో వేసి దహనం చేశారు. అనంతరం ఆయన జగన్ పాలన తీరును ఎండగట్టారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీలను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు, పార్టీ నాయకులు అట్టా సన్యాసిఅప్పారావు, ఇందల కొండలరావు, పైలా రథాల సన్యాసిరావు, లోకిరెడ్డి అబి సన్యాసినాయుడు పాల్గొన్నారు. అలాగే మండల వ్యాప్తంగా ఆదివారం భోగి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి వీధుల్లో భోగిమంటల్లో వేశారు.


వెన్నెలపాలెంలో ప్రజా వ్యతిరేక జీవో ప్రతులను భోగి మంటలో వేస్తున్న బండారు తదితరులు

రాష్ట్రానికి పట్టిన కీడు పోవాలి : ప్రగడ

ఎలమంచిలి: రాష్ట్రానికి చంద్రబాబు రూపంలో వెలుగు రావాలంటూ టీడీపీ నేతలు నినదిస్తూ భోగి మంటల్లో ప్రజా వ్యతిరేక ప్రభుత్వ విధానాల ప్రతులను దహనం చేశారు. ఆదివారం ఎలమంచిలిలోని టీడీపీ కార్యాలయం వద్ద జరిగిన భోగి సంబరాల్లో నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి దూళి రంగనాయకులు, నేతలు పాల్గొన్నారు. అనంతరం పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రగడ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల కారణంగా అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో


ఎలమంచిలి టీడీపీ ప్రాంతీయ కార్యాలయం వద్ద భోగి మంటల్లో ప్రభుత్వ జీవో ప్రతులను దహనం చేస్తున్న ప్రగడ, నేతలు

జిల్లా కార్యదర్శి రాజాన సూర్య నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ, టీడీపీ నేతలు బొద్దపు శ్రీనివాసరావు(రమణ), బొద్దపు నాగేశ్వరరావు, గొర్లె బాబూరావు, రాములు పాల్గొన్నారు.

అచ్యుతాపురం: రాష్ట్రానికి పట్టిన చీడ పోయి బాబు రాజ్యం రావాలని టీడీపీ ఎలమంచిలి ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఉదయం పూడిమడక తీరంలో పార్టీ శేణులతో కలిసి వైసీపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిర్ణయాల ప్రతులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. కార్యక్రమంలో మేరుగు బాపునాయుడు, వెంకటరావు, వై.అప్పలనాయుడు, నాగేశ్వరరావు, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు. కాగా మండలంలో భోగి పండగ సందర్భంగా తెల్లవారుజాము నుంచి గ్రామాల్లో భోగి మంటలు వేశారు. గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గాలి పటాలు ఎగురవేశారు.

జగన్ హామీ ప్రతులు దహనం

నక్కపల్లి: వైసీపీ ప్రభుత్వం అమలుచేయని హామీల ప్రతులను ఆదివారం తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు భోగి మంటల్లో వేసి దహనం చేశారు. జాబ్ కేలండర్లు, రైతులకు ధరల స్థిరీకరణ నిధి, సీపీఎస్ రద్దు తదితర హామీలను అమలు చేయలేని జగన్‌కు ప్రజలు గట్టి బుద్ధి చెబుతారని చెప్పారు. ఇందుకు సంబంధించిన ప్రతులను భోగిమంటల్లో దహనం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గం టీడీపీ నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, పెదిరెడ్డి చిట్టిబాబు, కొప్పిశెట్టి కొండబాబు, కురందాసు నూకరాజు, అమలకంటి అబద్దం, జానకి శ్రీను, కొప్పిశెట్టి బుజ్జి, పాల్గొన్నారు.


భోగిమంటల్లో జగన్ ప్రభుత్వం అమలుచేయని హామీల ప్రతులను దహనం చేస్తున్న అనిత, టీడీపీ నాయకులు

ఓట్లను కాజేసే గజదొంగ జగన్: మాజీ మంత్రి అయ్యన్న


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి అయ్యన్న

కశింకోట: ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ప్రజల ఓట్లను కాజేసే గజదొంగ అని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. భోగి పండగను పురస్కరించుకొని ఆదివారం మండలంలోని తీడ గ్రామంలో స్వర్గీయ ఎన్టీఆర్ పేరుతో జరిగిన తీర్థంలో ఆయన మాట్లాడుతూ జగన్ భూములను, ఇసుక, గ్రావెల్‌ను దోచుకొని ఇప్పుడు ఏకంగా ఓట్లపై పడ్డారని ఆరోపించారు. ఎన్టీఆర్ యుగపురుషుడు అని, వారి పేరుపై తీర్థం చేయడం ఆనందంగా ఉందన్నారు. అంతకు ముందు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భోగి పండగలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, దాడి రత్నాకర్ పాల్గొని వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన చీకటి జీవోలను భోగి మంటల్లో వేసి తగలబెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాయల మురళి, కోట్ని బాలాజీ, ఉగ్గిన రమణమూర్తి, గొంతిన శ్రీనివాసరావు, సిద్ధిరెడ్డి శ్రీనివాసరావు, చిరికి సన్యాసినాయుడు, మేడిశెట్టి సన్యాసినాయుడు, దుర్గా ప్రసాద్, అక్కునాయుడు, వేగి గోపీకృష్ణ, పెంటకోట రాము, చైతన్య, సత్తిబాబు పాల్గొన్నారు.

క్రైం... crime news

పండగపూట విషాదం

- వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి
- చోడవరం మండలంలో బైక్ ఢీకొని రైతు దుర్మరణం
- అనకాపల్లి తోటాడ జంక్షన్ వద్ద కారు ఢీకొని విజయనగరం వాసి మృతి
- చెట్టుపల్లి సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి ఒకరు..
- అనకాపల్లిలో రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

చోడవరం, జనవరి 14: మండలంలోని గజపతినగరం సమీపంలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో అంభేరుపురం గ్రామానికి చెందిన చందక సన్యాసిరావు(62) అనే రైతు మృతిచెందాడు. సన్యాసిరావు పొలం నుంచి చెరకు మోసులను కట్టుకుని తన మనవడితో కలిసి బైక్‌పై ఇంటికి వస్తున్నాడు. గజపతినగరం వద్ద ఎదురుగా వస్తున్న మోటారు బైక్ చెరకు మోసులకు తగలడంతో సన్యాసిరావు నడుపుతున్న బైక్ అదుపుతప్పి కుడివైపునకు వెళ్లింది. ఇదే సమయంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొనడంతో సన్యాసిరావు రోడ్డుపై పడిపోయాడు. తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్ వెనుక కూర్చున్న ఇతని మనవడు ఎగిరి తుప్పల్లో పడడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ప్రమాదం గురించి తెలుసుకున్న భార్య, కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరు అయ్యారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ అప్పలనాయుడు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో విజయనగరం వాసి మృతి

అనకాపల్లి టౌన్, జనవరి 14: అనకాపల్లి వద్ద జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో విజయనగరానికి చెందిన ఒక వ్యక్తి మృతిచెందాడు. ట్రాఫిక్ సీఐ టి.శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం సమీపంలోని పాతదుప్పాడ ఇందిరాకాలనీకి చెందిన ఆలం శ్రీనివాసరావు (45) సొంత పనుల మీదు ఆదివారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనంపై అనకాపల్లి వచ్చాడు. జాతీయ రహదారిలో తోటాడ జంక్షన్ వద్ద వాహనాన్ని ఆపి రోడ్డు దాటుతుండగా విశాఖపట్నం నుంచి విజయవాడ వైపు వెళుతున్న కారు ఢీకొన్నది. తీవ్రంగా గాయపడిన శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతిచెందాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి కుమారుడు లక్ష్మణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని సీఐ తెలిపారు.

బైక్ అదుపు తప్పి... ఇటుకబట్టీ కార్మికుడి..

నర్సీపట్నం అర్బన్, జనవరి 14: మండలంలోని చెట్టుపల్లి సమీపంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన బైక్ అదుపుతప్పిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. ఎస్‌ఐ వి.సోమలింగం అందించిన వివరాల ప్రకారం.. కోల్‌కతాకు చెందిన అబ్దుల్లా(40) అనే వ్యక్తి ఉపాధి కోసం కొంతకాలం క్రితం కుటుంబంతో సహా రావికమతం మండలం కొత్తకోటకు వలస వచ్చాడు. ఇక్కడ ఇటుకుల బట్టీలో కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం


మృతిచెందిన అబ్దుల్లా

తెల్లవారుజామున బైక్‌పై నర్సీపట్నం వచ్చి కూరగాయలు, ఇతర సరకులు కొనుగోలు చేశారు. తిరిగి కొత్తకోట వెళుతుండగా చెట్టుపల్లి బంకు వద్ద బైక్ అదుపుతప్పడంతో ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన ఇతనిని 108లో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికిఇ తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనకాపల్లి టౌన్, జనవరి 14: స్థానిక శారదా నది రైల్వే బ్రిడ్జి వద్ద రైలు ఢీకొన్న ప్రమాదంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్టు దువ్వాడ జీఆర్‌పీ ఎస్‌ఐ కె.శాంతారామ్ ఆదివారం తెలిపారు. సుమారు 60 ఏళ్ల వయసు గల ఈ వ్యక్తి విజయవాడ వైపు రైలు పట్టాలు మీదుగా నడుచుకుంటూ వెళుతుండగా అదే మార్గంలో వెనుక నుంచి వస్తున్న రైలు ఢీకొన్నది. దీంతో బ్రిడ్జి కింద పడి మృతిచెందాడు. 5.7 అడుగుల ఎత్తు


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

వున్నాడని, నీలిరంగు ట్రాగ్, నీలిరంగు ఫుల్ హ్యాండ్‌షర్టు ధరించి ఉన్నాడని, మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని రైల్వే ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని ఎన్టీఆర్ వైద్యాలయం మార్చురీకి తరలించామని, సంబంధీకులు ఎవరైనా మొబైల్ నంబరు 76739 06010కు ఫోన్ చేయాలని కోరారు.

కేఎన్ఆర్‌పేటలో చోరీ

- ఐదున్నర తులాల బంగారం, 50 తులాల వెండి అపహరణ

కొత్తూరు, జనవరి 14 : అనకాపల్లి మండలం కొత్తూరు నర్సింగరావుపేట గ్రామంలో ఈ నెల 12న ఓ ఇంట్లో చోరీ జరిగిందని అనకాపల్లి రూరల్ ఎస్‌ఐ సీహెచ్ నర్సింగరావు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి ఆదివారం ఆయన తెలిపిన వివరాలివి. ఈ నెల 11న కల్లేపల్లి దేవి భీమవరంలో ఉంటున్న తల్లి ఇంటికి వెళ్లింది. భర్త రమేశ్‌వర్మ ఢిల్లీ వెళ్లారు. ఈ నేపథ్యంలో ఈ నెల 12న తెల్లవారుజామున పని మనిషి పూల మొక్కలకు నీళ్ళు పోసేందుకు రాగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయన్నారు. వెంటనే ఇంటి యజమాని దేవి ఇంటి పక్కన ఉన్న స్నేహితురాలు అనకాపల్లి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు. కాగా ఇంట్లో ఉన్న ఐదున్నర తులాల బంగారం, 50తులాల వెండి అపహరణకు గురైందని ఆయన తెలిపారు.

పేకాట శిబిరాలపై పోలీసుల దాడి

- 27 మంది అరెస్టు

ఎస్.రాయవరం, జనవరి 14: మండలంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరాలపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఎస్‌ఐ ప్రసాదరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఐదు పేకాట శిబిరాలపై దాడులు నిర్వహించి, పేకాట ఆడుతున్న 27 మంది వ్యక్తులను అరెస్టు చేసి రూ.19,710 నగదును స్వాధీనం చేసుకున్నారు. కోడి పందాల శిబిరంపై దాడి చేసి రెండు కోళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

కూండ్రంలో పేకాట శిబిరంపై దాడి

కొత్తూరు, జనవరి 14: అనకాపల్లి మండలం కూండ్రం గ్రామ శివారున పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామని అనకాపల్లి రూరల్ ఎస్‌ఐ సీహెచ్ నర్సింగరావు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.21,110లు నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

జోరుగా కోడి పందేలు, పేకాట శిబిరాలు

అచ్యుతాపురం, జనవరి 14: భోగి సందర్భంగా మండలంలో పలు గ్రామాల్లో వైసీపీ నాయకుల కనుసన్నల్లో గుట్టుగా కోడి పందేలు, పేకాటలు జరిగాయి. దుప్పితూరులో ఆదివారం ఉదయం కోడిపందాలకు రంగం సిద్ధం చేశారు. ఈ విషయం పోలీసులకు తెలిసి పందేలు జరిగే స్థలానికి వెళ్లడంతో నిర్వాహకులు పందేలు జరపలేదు. అలాగే హరిపాలెంలో ఉదయం 11 గంటల నుంచి కోడి పందేలు నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు పోలీసులు వస్తున్నారని తెలిసి పందెం రాయుళ్లు పరుగులు తీశారు. అప్పటికే రెండు కోళ్లు పందెంలో చనిపోయి ఉండడంతో వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	120.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	599
విజయనగరం	603
శ్రీకాకుళం	603

27న గవరపాలెం గౌరమ్మ జాతర


జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, జనవరి 14 : స్థానిక గవరపాలెం గౌరీ పరమేశ్వరుల జాతర మహోత్సవం ఈ నెల 27వ తేదీన నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోశ్ అప్పారావునాయుడు చెప్పారు. ఆదివారం సాయంత్రం సతకంపట్టు వద్ద కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 24వ తేదీ ఉదయం గౌరీ పరమేశ్వరుల వార్షిక కల్యాణం నిర్వహించనున్నామన్నారు. అదే రోజు మధ్యాహ్నం అమ్మవారికి భారీ ఎత్తున సారె ఊరేగింపు నిర్వహించనున్నామన్నారు. 26వ తేదీన మళ్ల జగన్నాథం కల్యాణ మండపంలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదే రోజు సాయంత్రం పరమేశ్వరి పార్కు వద్ద కొణతాల మనోహరనాయుడు తీర్థం ఉంటుందన్నారు. 27న గౌరమ్మ జాతరలో భాగంగా తెల్లవారుజామున ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తామని, ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు కొణతాల మురళీకృష్ణ, పీవీ రమణ, కొణతాల శ్రీనివాసరావు, కాండ్రేగుల విశ్వేశ్వరరావు, కొణతాల ప్రసాద్, దాడి కృష్ణ పాల్గొని ఉత్సవం నిర్వహణ వివరాలను విలేకరులకు వివరించారు.

'నా సామిరంగ' చిత్ర విజయోత్సవం


విజయోత్సవ కేకును కట్ చేస్తున్న దర్శకుడు త్రినాథరావు

అనకాపల్లి టౌన్, జనవరి 14 : స్థానిక షిర్డిసాయి థియేటర్ వద్ద హీరో అక్కినేని నాగార్జున నటించిన 'నా సామిరంగ' చిత్ర విజయోత్సవాన్ని నాగార్జున ఫ్యాన్స్ రాష్ట్ర ప్రతినిధి మళ్ల సురేంద్ర ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. చిత్ర విజయోత్సవ కేకును దర్శకుడు నక్కిన త్రినాథరావు కట్‌చేసి అందరికీ పంచారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున బాణసంచా వెలిగించారు. ఈ కార్యక్రమంలో సినీ నటుడు ప్రసన్నకుమార్, హీరో శాంతిచంద్ర, దర్శకుడు ఆడారి మూర్తి సాయి, అక్కినేని అభిమానులు సీహెచ్ అవతారం, ఎస్.భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

'డ్రైవర్లపై 1062 చట్టం రద్దు చేయాలి'

సబ్బవరం, జనవరి 14: కేంద్ర ప్రభుత్వం డ్రైవర్లపై తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టం 1062ను వెంటనే రద్దు చేయాలని జయహో రథసారథి డ్రైవర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసు యేలేటి డిమాండ్ చేశారు. అనకాపల్లి- ఆనందపురం హైవేపై బాటజంగాలపాలెం టోల్‌గేట్ వద్ద ఆదివారం పలువురు డ్రైవర్లు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు మూల స్తంభాలైన డ్రైవర్లపై ఇటువంటి చట్టం తీసుకురావడం అన్యాయమన్నారు. జీవోను రద్దు చేయకుంటే ఈ నెల 17వ తేదీ నుంచి దేశవ్యాప్త ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి భూపతిరాజు, కిశోర్, రామకృష్ణ, రాపర్తి ముత్యాలనాయుడు, కాపుశెట్టి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నిరసన


భోగిమంటలో ప్రభుత్వ హామీల పత్రికా క్లిప్పింగ్‌లను వేసి నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నేతలు

చోడవరం, జనవరి 14: వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులకు వ్యతిరేకంగా జారీ చేసిన జీవోల ప్రతులను ఆదివారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు భోగిమంటల్లో వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. చిన్నబ్బాయి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఉద్యోగుల అణిచివేత ధోరణికి పాల్పడడం, వారిని వేధింపులకు గురిచేయడం అప్రజాస్వామికమని విమర్శించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు పూర్తిగా చెల్లించకపోగా, సీపీఎస్ రద్దు వాగ్దానం కూడా తుంగలో తొక్కి, ఉద్యోగులను దారుణంగా మోసగించారని ఆరోపించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన వరాల పత్రికా క్లిప్పింగ్‌లను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు బొడ్డపాటి రామచంద్రరావు. నందికోళ్ల గణేశ్, వేగి సూర్యప్రకాశ్, కుదర కామరాజు, కాట్రపల్లి సత్తిబాబు. డి.శ్రీను, అప్పలమూర్తి, ఎర్రయ్య సబ్బవరపు నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బీసీలంటే జగన్‌కు అలర్జీ

- టీడీపీ జిల్లా బుద్ద నాగజగదీశ్వరరావు


సంఘీభావం తెలుపుతున్న టీడీపీ నాయకులు

దేవరాపల్లి, జనవరి 14: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి బీసీలంటే అలర్జీ అని, నలుగురు రెడ్డిలకు తప్ప మరెవరితోనూ జగన్‌కు సంబంధం లేదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. మాడుగులలో ఆదివారం సాయంత్రం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్ ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలకు సేవలు అందించే వ్యవస్థలన్నింటినీ రోడ్డున పడేసి, నిర్వీర్యం చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. జయహో బీసీ ర్యాలీ మహేశ్వరి థియేటర్ నుంచి ప్రధాన వీధుల్లో సాగింది. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్సు ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో బీసీలకు పెద్దపీట వేశారన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీకుమార్ మాట్లాడుతూ బీసీల నడ్డి విరిచిన ప్రభుత్వం వైసీపీదేనన్నారు. ఈ కార్యక్రమంలో పైలా ప్రసాదరావు, గుర్రం నూకరాజు, వనంశ్రీనువాసరావు, బత్తుల లక్ష్మి, కర్రినాయుడు, లక్ష్మణరావు, పోతల పాత్రునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం

నక్కపల్లి, జనవరి 14: మండలంలోని ఉపమాక క్షేత్రంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం మధ్యాహ్నం ఉపమాకలో గోదాదేవి, శ్రీరంగనాథుడి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయానికి ఆనుకుని వున్న స్వామివారి పుష్పతోటలో గోదాదేవి, రంగనాథస్వామి వారి కల్యాణోత్సవాన్ని ఆలయ ప్రధానార్చకుడు గొట్టుముక్కల ప్రసాద్, అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, సాయి గోపాలాచార్యులు, నండూరి రాజగోపాలాచార్యులు వైభవంగా జరిపించారు. కల్యాణోత్సవం అనంతరం మాడవీధుల్లో స్వామివారి ఊరేగింపు కన్నుల పండువగా జరిగింది. పుణ్యకోటి వాహనంపై స్వామివారు, ఇత్తడి శేష వాహనంపై గోదాదేవి అమ్మవారిని అలంకరించి మాడవీధుల్లో మంగళ వాద్యాల నడుమ ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణోత్సవం రేపు

ప్రతి ఏటా కనుమ పండగ రోజు ఉపమాక వెంకటేశ్వరస్వామి విశిష్ట అలంకరణలో భక్తులకు దర్శమిస్తుంటారు. ఆ రోజు సాయంత్రం వైభవంగా గిరిప్రదక్షిణోత్సవం జరుగుతుంది. ప్రతీ ఏటా కనుమ పండగ నాడు మాత్రమే రాజాధిరాజ అలంకరణలో భక్తులకు ఉపమాక వెంకన్న


స్వామివారి తిరు వీధి ఉత్సవం, (ఇన్‌సెట్‌లో) స్వామివారు

విశిష్ట దర్శనమిస్తారు. ఈ నెల 16న మంగళవారం సాయంత్రం జరిగే గిరి ప్రదక్షిణోత్సవాన్ని తిలకించేందుకు వేలాది మంది భక్తులు ఉపమాక వస్తారు. గరుడాద్రి పర్వతం చుట్టూ గోవిందనామస్మరణతో గిరి ప్రదక్షిణ జరుగుతుంది. అనంతరం స్వామివారి పుష్కరిణి వద్ద వున్న లంక వారి రాతి మండపం వద్ద కరి-మకరి సంవాదం జరుగుతుంది. తదుపరి రాత్రి 9 గంటలకు రాజాధిరాజుగా ఉపమాక వెంకటేశ్వరస్వామి తిరువీధి సేవ కూడా జరుగుతుంది.

జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు రేపు

చీడికాడ, జనవరి 14: మండలంలోని శిరిజాం గ్రామంలో ఈ నెల 16వ తేదీన జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించనున్నామని ఆ గ్రామ నిర్వాహకులు ఆదివారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. పైడితల్లమ్మ అమ్మవారి తీర్థాన్ని పురస్కరించుకొని మంగళవారం ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమం జరుగుతుందన్నారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు జిల్లాస్థాయి ఎడ్ల పరుగు పోటీలు జరుగుతాయన్నారు. ముగ్గులు, కోలాటాలు ఘనంగా నిర్వహించనున్నామని తెలిపారు. ఎడ్ల పరుగు పోటీల్లో పాల్గొనే వారు మధ్యాహ్నం రెండు గంటల్లో 7989909411 నంబరుకి ఫోన్ చేసి సంప్రతించాలని నిర్వాహకులు కోరారు.

జిల్లా స్థాయి ఎడ్ల పోటీల్లో చీడికాడకు ప్రథమ స్థానం


ఉమ్మలాడలో ఎడ్ల పోటీలు జరుగుతున్న దృశ్యం

మునగపాక, జనవరి 14: మండలంలోని ఉమ్మలాడ గ్రామంలో ఆదివారం సాయంత్రం జరిగిన జిల్లా స్థాయి ఎడ్ల బండ్ల పోటీల్లో చీడికాడ మండలానికి ప్రథమ స్థానం దక్కింది. గ్రామ మాజీ సర్పంచ్ కర్రి అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో అనకాపల్లి, విజయనగరం జిల్లాల నుంచి రైతులు హాజరయ్యారు. ఈ పోటీల్లో పరవాడ నాయుడు ప్రథమ స్థానం (అర్జునగిరి, చీడికాడ మండలం), లెక్కల పైడితల్లి ద్వితీయ స్థానం (లెక్కలవానిపాలెం, చోడవరం), సిద్ధివినాయక టీమ్ తృతీయస్థానం (వేపాడ, విజయనగరం జిల్లా), గండి వెంకటరమణ, నాల్గో స్థానం (వావిలపాడు, విజయనగరం), అడ్డెపల్లి అనిల్‌కుమార్ ఐదో స్థానం, (చుక్కపల్లి, చీడికాడ మండలం) దక్కించుకున్నారు.

జిల్లా స్థాయి గుర్రపు పందేల్లో విజేత చోడవరం

ఎలమంచిలి, జనవరి 14: మండలంలోని జంపపాలెం గ్రామ శివారులో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి గుర్రపు పందేల్లో చోడవరం మండలం విజేతగా నిలిచినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 17 జట్లు పాల్గొన్నాయి. చోడవరం మండలం రాయపురాజుపేటకు చెందిన దాడి నూక హనుమంతరావు ప్రథమ, దేవరాపల్లికి చెందిన వి.కుమార్ ద్వితీయ, అచ్యుతాపురం మండలం రామన్నపాలేనికి చెందిన విక్రమ్ తృతీయ స్థానాలు సాధించారు. వీరికి సోమలింగపాలెం, జంపపాలెం గ్రామాలకు చెందిన నేతలు బహుమతులు అందజేశారు.

'రాష్ట్రానికి కీడు తొలగాలి'

మాకవరపాలెం, జనవరి 14: రాష్ట్రానికి పట్టిన కీడు తొలగాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. ఆదివారం మండలంలోని లచ్చన్నపాలెంలో జరిగిన భోగి వేడుకల్లో అయ్యన్న పాత్రుడు సతీమణి చింతకాయల పద్మావతి, తనయులు విజయ్, రాజేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంగిరెద్దుకు


రాష్ట్ర సమస్యల ప్లకార్డులను దహనం చేస్తున్న దృశ్యం

ఆహారం తినిపించారు. అనంతరం భోగిమంటల్లో రాష్ట్ర సమస్యల ప్లకార్డులను వేసి దహనం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు, నాయకులు అల్లు రామునాయుడు, పోతల రాంబాబు, జోగిపాత్రుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామిని దర్శించుకున్న రత్నాకర్ దంపతులు

అనకాపల్లి టౌన్, జనవరి 14: స్థానిక సుంకరమెట్ట జంక్షన్‌లోని సత్యనారాయణస్వామి, సూర్యనారాయణస్వామిలను ఆదివారం డైట్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు దర్శించుకున్నారు. స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు.



ఘనంగా భోగి పండుగ

అనకాపల్లి టౌన్, జనవరి 14 : స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయ ఆవరణలో ఆదివారం సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ బండారు ప్రసాద్‌ల ఆధ్వర్యంలో హరిదాసుల కార్యక్రమం, గంగిరెద్దుకు పూజలు, ముత్యాల ముగ్గులతో బాలాలయం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పెద్ద ఎత్తున భోగిమంటను వేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. అలాగే వివేకానందనగర్‌లోని ఎంపీ నివాసం వద్ద ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి కుటుంబసభ్యులు భోగి పండగను జరుపుకున్నారు.

పాయకరావుపేటలో.. భోగి పండుగను ఆదివారం పట్టణ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామునే పట్టణంలో అన్ని ప్రధాన కూడళ్లలో భోగి మంటలు వేశారు. పిల్లలు, పెద్దలు నూతన వస్త్రాలు ధరించి భోగి మంటల్లో పిడకలు వేశారు. పాండురంగస్వామి దుర్గాలమ్మచెట్టు, రాజుగారిబీడులోని వేంకటేశ్వరస్వామి, సాయినగర్‌లోని షిర్డీసాయి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

రాంబిల్లిలో.. భోగి పండుగను ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. భోగి మంటలు వేసిన అనంతరం ఆలయాల్లో పూజలు చేశారు. వాడనర్సాపురంలో వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా అన్నసమారాధనను నిర్వహించారు.



అనకాపల్లి టౌన్: గవరపాలెంలో భోగిమంట వద్ద నృత్యం చేస్తున్న స్థానికులు

సబ్బవరంలో.. మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం భోగి సంబరాలను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. యువకులు భోగి మంటలు వేసి సందడి చేశారు. పలు గ్రామాల్లో యువకులు గాలిపటాలు ఎగరవేశారు.

ఎస్. రాయవరంలో.. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలందరూ ఆదివారం భోగి పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారి నుంచి చన్నీటిస్నానం ఆచరించి, నూతన దుస్తులు ధరించి అనంతరం భోగి మంటలు వేసుకొని ఆనందంగా పండుగ జరుపుకున్నారు.

పండగ పూట కొనసాగిన అంగన్‌వాడీల నిరసన

పరవాడ, జనవరి 14 : తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె 34వ రోజు ఆదివారం కొనసాగింది. భోగి పండగను పురస్కరించుకుని అంగన్‌వాడీలంతా ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన షోకాజ్ నోటీసులతో పాటు జీవో నంబరు -2 ప్రతులను భోగిమంటలో వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు సీహెచ్. దేవి, ఎం. రమణి, ఎస్. పార్వతి, రామలక్ష్మి, అరుణ, శ్రీదేవి పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో.. సమ్మెలో భాగంగా ఆదివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు భోగి మంట వేసి ఎస్మా జీవో ప్రతులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పద్మ, పాల్గొన్నారు.

సబ్బవరంలో.. అంగన్‌వాడీలు భోగిమంటల్లో ఎస్మా జీవో ప్రతులను ఆదివారం దహనం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు ఎం. వరలక్ష్మి, జగదేశ్వరీ, దేవీ పాల్గొన్నారు.

మునగపాకలో.. విధుల్లో చేరాలంటూ ప్రభుత్వం జారీ చేసిన ఎస్మా జీవో ప్రతులను అంగన్‌వాడీలు ఆదివారం భోగి మంటల్లో వేసి దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బ్రహ్మాజీ, రామలక్ష్మి, హేమలత పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్‌లో.. అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె ఆదివారం 34వ రోజుకు చేరుకుంది. నెహ్రూచౌక్‌లోని బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో అంగన్‌వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలిచ్చారు.

పాయకరావుపేటలో.. అంగన్‌వాడీల ఆందోళన ఆదివారం భోగి పండుగ నాడు కొనసాగింది. స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట 34 రోజులుగా వారు ఆందోళన చేస్తున్నారు. భోగి పండుగ నాడు ధర్నా శిబిరం వద్ద భోగి మంట వేసుకున్నారు.

కశింకోటలో.. మండలంలోని నర్సింగబిల్లిలో అంగన్‌వాడీలు ఆదివారం జగనన్నకు చెబుదాం అంటూ కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సంతకాలను చేయించారు. మాజీ సర్పంచ్ మజ్జి సూర్య ప్రకాష్ ఇంటి వద్ద భోగి మంటను అంగన్‌వాడీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. నాగశేషు వేశారు.



పరవాడలో షోకాజ్‌లను భోగి మంటలో వేస్తున్న అంగన్‌వాడీలు

భక్తిశ్రద్ధలతో గోదాదేవి కల్యాణం

అనకాపల్లి టౌన్, జనవరి 14 : స్థానిక గాంధీనగరం అంజయ్యకాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసం ముగింపు సందర్భంగా ఆదివారం గోదాదేవి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి గోప అప్పలాచార్యులు (చక్రవర్తి) మంత్రోచ్చరణల మధ్య ఓబులరెడ్డి దంపతులతో కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. ప్రముఖ వైద్యుడు కె. విష్ణుమూర్తి ఆలపించిన భక్తి గేయాలు ఆకట్టుకున్నాయి.

పాయకరావుపేటలో.. ధనుర్మాసోత్సవాత్సవాల్లో భాగంగా పాయకరావుపేటలోని పలు ఆలయాల్లో ఆదివారం గోదాదేవి కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక రాధారుక్మిణీ సమేత పాండురంగస్వామి ఆలయంలో ఆదివారం భోగి పండుగను పురస్కరించుకుని పాండురంగస్వామి, అమ్మవార్ల మూలవిరాట్టులను ప్రధానార్చకులు కృష్ణస్వామి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ మండపంలో ప్రత్యేక వేదికపై పాండురంగస్వామి, గోదాదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించి, కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

కోటవురట్లలో.. మండలంలోని కైలాసపట్నం రాజగోపాల స్వామి వారి ఆలయంలో గోదాదేవి కల్యాణం ఆగమపండితులు అరవెల్లి సత్యనారాయణ ఆచార్యులు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యురాలు ఎక్కిరాల మణికుమారి ఆధ్వర్యంలో నిర్వహించగా.. గ్రామపెద్దలు సిద్దాబత్తుల సత్యనారాయణ, జడ్‌పీటీసీ సభ్యురాలు ఉమాదేవి, ఉపసర్పంచ్ సిద్దాబత్తుల నాగేశ్వరరావు, బాబ్జి పాల్గొన్నారు.

ఎలమంచిలిలో.. స్థానిక కొత్తపేట సీతారాముల ఆలయంలో ఆదివారం గోదాదేవి కల్యాణం ఘనంగా నిర్వహించారు. దేవతామూర్తుల విగ్రహాలను స్థానిక న్యాయవాది శ్రీనివాస పట్నాయక్ కుటుంబీకులు అందజేశారు. వేద పండితుల సమక్షంలో కల్యాణ ఉత్సవాన్ని నిర్వహించారు.

ఎస్.రాయవరంలో.. మండలంలోని పలు ఆలయాల్లో ఆదివారం గోదాదేవి అమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఎస్.రాయవరం, గుడివాడ, దార్లపూడి గ్రామాల్లో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో గోదాదేవి కల్యాణ వేడుకలను నేత్రపర్వంగా జరిపారు. పరిసర గ్రామాల భక్తులు భక్తిశ్రద్ధలతో కల్యాణాన్ని తిలకించారు.

పేదలకు వస్త్రాల పంపిణీ

అనకాపల్లి టౌన్, జనవరి 14 : సంక్రాంతి పండుగ సందర్భంగా స్థానిక గవరపాలెం కామాక్షిదేవి ఆలయంలో ఆదివారం విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్తుర్తి గంగారావు, పట్టణ అధ్యక్షుడు కోటిపల్లి జేజిబాబు పేదలకు చీరలు, బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కొమ్మోజి రాజు, పొన్నాడ పెదబాబు, సభ్యులు పాల్గొన్నారు. అలాగే నిదానందొడ్డిలో స్వర్గీయ బుద్ద చినసూర్యనారాయణ జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు బుద్ద రాజేష్, సూర్య ప్రకాశరావు ఆధ్వర్యంలో పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్క్ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు కొణతాల బాలసుబ్రహ్మణ్యం, బుద్ద మోహన్, కొణతాల మాధవ, పీలా హరి, బుద్ద సంతోష్ పాల్గొన్నారు.

ముగ్గుల పోటీకి విశేష స్పందన

నక్కపల్లి, జనవరి 14: సంస్కృతి, సంప్రదాయాలను పిల్లలకు చాటిచెప్పే అతి పెద్ద పండుగ సంక్రాంతి మాత్రమేనని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగలపూడి అనిత అన్నారు. నక్కపల్లికి సమీపాన తన నివాసం వద్ద మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న వారందరిని అనిత అభినందించారు. విజేతలకు ఆమె నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుర్రం రామకృష్ణ, పెదిరెడ్డి శ్రీను, కోన అప్పలరాజు, అయినంపూడి అప్పలరాజు, పల్లా రాంబాబు పాల్గొన్నారు.

గాలి పటాల పోటీలను ప్రారంభం

మునగపాక, జనవరి 14 : మునగపాకలో ఆదివారం గాలి పటాల పోటీలను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సుందరపు విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలి పటాలు ఎగురవేయడం అనాదిగా వస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల నాయకులు టెక్కలి పరశురామ్, ఏవీ సత్యనారాయణ, ఆడారి శ్రీకాంత్, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భోగి మంటల్లో ఉద్యోగ వ్యతిరేక ప్రతులు దహనం: యూటీఎఫ్

ఎలమంచిలి, జనవరి 14: ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరిని నిరసిస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో భోగి మంటల్లో ప్రభుత్వ ఉద్యోగ వ్యతిరేక ప్రతులను దహనం చేసినట్టు సంఘ గౌరవాధ్యక్షుడు ఏ.మల్లికార్జున్ తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఈ.ఎల్లయ్యబాబు, ట్రెజరర్ పి.గౌతమ్, కార్యదర్శి పి.హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా విలేజ్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

సబ్బవరం, జనవరి 14 : మండలంలోని అంతకాపల్లి శివారు రావలమ్మపాలెంలో శుక్రవారం విలేజ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం వీకేపీసీపీఐఆర్ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ టోర్నీలో 16 జట్లు పాల్గొంటున్నారు.

ఘనంగా సినీనటుడు శోభన్‌బాబు జయంతి

అనకాపల్లి టౌన్, జనవరి 14: స్థానిక విజయరామరాజుపేటలో ఆదివారం ఆలిండియా శోభన్‌బాబు ఫ్యాన్స్ అధ్యక్షుడు ముగడ అప్పారావు ఆధ్వర్యంలో సినీ నటుడు దివంగత శోభన్‌బాబు జయంతిని ఘనంగా నిర్వహించారు. శోభన్‌బాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విజయరామరాజుపేట వాసులు ఆళ్ల శివరామ సత్యనారాయణ, పలకా రాము, పోలారపు త్రినాథ్, అప్పికొండ వెంకటరావు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల క్యాలెండర్ ఆవిష్కరణ

అనకాపల్లి టౌన్, జనవరి 14: విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను ఎస్‌డీ గ్రూప్స్ అధినేత కాండ్రేగుల శ్రీరామ్ ఆదివారం ఆవిష్కరించారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు పాత్రపల్లి వీరుయాదవ్ ఆధ్వర్యంలో గవరపాలెంలో జరిగిన కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు మొల్లి చంద్రశేఖర్, పిళ్లా లక్ష్మీనారాయణ, కోరుకొండ నాగరాజు, దూలి శివ తదితరులు పాల్గొన్నారు.

గోవాడ- చోడవరం మధ్య ట్రాఫిక్ కష్టాలు

... 5వ పేజీ తరువాయి

చేయించాలని ఎన్నో ఏళ్లుగా స్థానికులు, వాహనదారులు కోరుతున్నా పాలకులు పట్టించుకోవడంలేదు. ఎట్టకేలకు మూడేళ్ల క్రితం మంజూరైన ఎన్‌డీబీ నిధులతో బీఎన్ రోడ్డు విస్తరణ పనులు పూర్తయితే రవాణా కష్టాలు తొలగుతాయని ప్రజలు భావించారు. కానీ ఒక అడుగు ముందుకు... ఆరు అడుగులు వెనక్కు అన్న చందంగా తయారైంది బీఎన్ రోడ్డు అభివృద్ధి పరిస్థితి. పోలీసు అధికారులు స్పందించి వెంకన్నపాలెం- చోడవరం మధ్య తరచూ ట్రాఫిక్ స్తంభించే బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్ కల్వర్టు వద్ద, గోవాడ వంతెన వద్ద పోలీసులను ఏర్పాటు చేయాలని, పరిమితికి మించి చెరకు లోడుతో వచ్చే వాహనాలను నియంత్రించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏయూ వీసీ పోస్టుపై వీడని సస్పెన్స్

... 5వ పేజీ తరువాయి

భావిస్తున్నారని, ఝాన్సీ ఎంపీగా బరిలోకి దిగుతుండడంతో వీసీ నియామకంపై మంత్రి మరింతగా దృష్టిసారించే అవకాశముందంటున్నారు. ఈ నేపథ్యంలో మాజీ వీసీకి దాదాపు దారులు మూసుకుపోయినట్టేనంటున్నారు. మిగిలిన ఇద్దరిలో ఒకరికి ఎంపీ స్థానానికి ఖరారైన బొత్స ఝాన్సీ లక్ష్మితో పరిచయం ఉందని, ఆమె ద్వారా ప్రయత్నాలు సాగిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సంక్రాంతి తరువాత ఏయూ వీసీ పోస్టు భర్తీపై సస్పెన్స్‌కు తెరపడుతుందని అంచనా వేస్తున్నారు. ఎన్నికల నిబంధనలు అమల్లోకి రాకముందే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఏయూ అధికారులు భావిస్తున్నారు. సెర్చ్ కమిటీ నివేదికలోని ముగ్గురిలో ఒకరికి కాకుండా, కొత్త వారికి అవకాశం ఇవ్వాలని భావిస్తే మాత్రం వీసీ నియామక ప్రక్రియ మళ్లీ మొదటికి వచ్చే అవకాశముందంటున్నారు. ఎన్నికల తరువాత ప్రక్రియ చేపట్టాలని భావిస్తే ప్రస్తుత ఇన్‌చార్జి వీసీనే కొనసాగించే అవకాశం ఉందంటున్నారు. మొత్తమ్మీద వీసీ ఎంపిక ప్రక్రియపై సంక్రాంతి తరువాతే స్పష్టత వచ్చే అవకాశముందని వర్సిటీ వర్గాలు చెబుతున్నాయి.

నర్సీపట్నం
నియోజకవర్గం

ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలు అందడం లేదు : జనసేన



రోగులతో మాట్లాడుతున్న జనసేన నాయకులు

నర్సీపట్నం అర్బన్, జనవరి 14 : నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో వైద్యం అందని ద్రాక్షలా మారిందని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన వీర సూర్యచంద్ర విమర్శించారు. ఆదివారం జనసేన నాయకులతో కలిసి ఆసుపత్రిని సందర్శించారు. అనంతరం రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో ఆసుపత్రిలో పేదలకు వైద్యం అందని పరిస్థితి ఉందన్నారు. అప్పుడే పుట్టిన పిల్లలను ప్రైవేటు ఆసుపత్రులకు పంపిస్తున్నారన్నారు. చిన్న పిల్లల వైద్యులు ఎవరూ అందుబాటులో లేరన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ఉన్న ఎమ్మెల్యే ఒక్కసారి కూడా ఆసుపత్రిపై దృష్టి సారించలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు కొత్తకోట రామశేఖర్, పెనుపోతుల నాగు, అల్లు నరేష్, పైడ సతీష్ పాల్గొన్నారు.

ఘనంగా ఏఎల్‌పురంలో అప్పికొండమ్మ తీర్థం

కృష్ణాదేవిపేట, జనవరి 14: ఏఎల్‌పురం మేజర్ పంచాయతీలో గల అప్పికొండమ్మ, కనకదుర్గ ఆలయాల వద్ద తీర్థం ఆదివారం గ్రామస్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి భక్తులు పోటెత్తారు. పరిసరాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. కొంగసింగి, పాతకృష్ణాదేవిపేట,సీహెచ్.నాగాపురం గ్రామాల భక్తులు తరలివచ్చారు.

పలు గ్రామాల్లో మేలుకొల్పులు

గొలుగొండ, జనవరి 14: మండలంలోని ధనుర్మాసం ముగింపు సందర్భంగా గ్రామాల్లో మేలుకొల్పులు ఆదివారం ముగిశాయి. కొత్తజోగంపేట, గొలుగొండ, జోగంపేట, శ్రీరాంపురం, పాకలపాడు, చీడిగుమ్మల, సాలికలమల్వరం, కొత్తమల్లంపేట, పప్పుశెట్టిపాలెం, జానకిరాంపురం, గుండుపాలల్లో సీతారాముల చిత్రపటాలను ఊరేగించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

మాకవరపాలెం, జనవరి 14: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు. గ్రామాల్లో జరిగే తీర్థాలు, సంబరాల్లో అశ్లీల నృత్యాలు, కోడిపందాలు, పేకాట, జూదాలు నిర్వహించినా.. ప్రోత్సహించిన వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

శోభాయమానంగా భోగి పండగ

» గాలిపటాలు పంపిణీ చేసిన యువ ఐఏఎస్ మౌర్య భరద్వాజ్



నర్సీపట్నంలో భోగి పండుగ సందడి



గాలి పటాలు పంపిణీ చేస్తున్న యువ ఐఏఎస్ భరద్వాజ్

నర్సీపట్నం, జనవరి 14 : ఎన్టీఆర్ మినీ స్టేడియంలో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం భోగి పండగను ఘనంగా నిర్వహించారు. ఈ వేడకలో కడప అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డాక్టర్ కిరణ్మయి దంపతులు ముఖ్యఅతిథులుగా హాజరై భోగి మంట వెలిగించారు. స్కూల్ విద్యార్థుల కోలాటం ప్రదర్శన, డూడూ బసవన్న విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాడుతా తీయగా విన్నర్ ధీరజ్ భక్తి పాటలతో ఉర్రూతలూగించారు. మౌర్య భరద్వాజ్ దంపతుల చేతుల మీదుగా చిన్న పిల్లలకు గాలి పటాలు చేశారు. భోగి సంప్రదాయ వంటలు పప్పు అన్నం, పచ్చిపులుసు, పొంగలి, అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు చింతకాయల సన్యాసిపాత్రుడు, అధ్యక్షుడు అడిగర్ల వరహాల నాయుడు, కార్యదర్శి ఎంఎస్ ప్రసాద్, ట్రెజరర్ పలిమార్ రాజేశ్వరి సుకుమార్, ఉపాధ్యక్షుడు డాక్టర్ హెచ్‌వీ దొర, సీనియర్ న్యాయవాది కామిరెడ్డి సత్యనారాయణ, ఎస్‌ఈబీ సీఐ ఆర్‌వీఆర్‌కే చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేటలో.. భోగి పండగ సందర్భంగా భోగి మంటలు, రామాలయాల వద్ద అన్నసమారాధనలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కట్టెలు, పిడకలతో భోగిమంటలు వేశారు. పాతకృష్ణాదేవిపేట, సీహెచ్.నాగాపురం, ఏఎల్‌పురం గ్రామాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు పందిరి సత్యంనాయుడు, ఎలమంచిలి రఘురామ్‌చంద్రరావు, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.



భోగి మంటల్లో ప్రతులను దహనం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

భోగి మంటల్లో ప్రజా వ్యతిరేక నిర్ణయాల ప్రతులు దహనం

నర్సీపట్నం, జనవరి 14 : ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల వ్యతిరేక నిర్ణయాల ప్రతులను భోగి మంటల్లో వేసి యూటీఎఫ్ నాయకులు ఆదివారం దహనం చేశారు. యూటీఎఫ్ విశాఖ జిల్లా నాయకులు దాసరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులను ప్రభుత్వం శత్రువులుగా చూస్తూ, వారికి రావల్సిన బకాయిలను సైతం వాడుకుంటుందన్నారు. బకాయిలు పూర్తిగా చెల్లించే వరకు ఉద్యమం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కళింగ సతీష్, పి.గాయత్రి, చిట్టయ్య, గంట్యాడ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణ మాస్టర్‌కు పూర్వ విద్యార్థుల సత్కారం



రామకృష్ణ మాస్టారును సన్మానిస్తున్న పూర్వపు విద్యార్థులు

నాతవరం, జనవరి 14 : స్థానిక ఆర్‌కే ట్యూటోరియల్ మాస్టర్ శెట్టి రామకృష్ణను 1988-2001 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఇక్కడ ఘనంగా సన్మానించారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశంలో 400 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాస్టర్‌ను అన్ని బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు విడివిడిగా సత్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. తన దగ్గర చదువున్న విద్యార్థులు అన్ని రంగాలలో ఉన్నత స్థానాలలో ఉండడం చాలా సంతోషంగా ఉందన్నారు. తనకు ఒక కోరిక ఉందని, తన శిష్యుల కుమారుల్లో ఎవరైనా ఐఏఎస్‌కు ఎంపికై నాతవరానికి పేరు తేవాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం తాను తిరుపతి జిల్లాలో కేకేవిపురం హైస్కూల్‌లో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 కామిరెడ్డి వరహాలబాబు, ఎన్‌ఆర్‌ఐలు శెట్టి సతీష్, పైల వెంకటరమణ, పారుపల్లి కిరణ్, జిల్లా ఇన్‌చార్జి అగ్నిమాపకశాఖ అధికారి రుత్తల వెంకటరమణ పాల్గొన్నారు.

గోవాడ- చోడవరం మధ్య ట్రాఫిక్ కష్టాలు

... 5వ పేజీ తరువాయి

చేయించాలని ఎన్నో ఏళ్లుగా స్థానికులు, వాహనదారులు కోరుతున్నా పాలకులు పట్టించుకోవడంలేదు. ఎట్టకేలకు మూడేళ్ల క్రితం మంజూరైన ఎన్‌డీబీ నిధులతో బీఎన్ రోడ్డు విస్తరణ పనులు పూర్తయితే రవాణా కష్టాలు తొలగుతాయని ప్రజలు భావించారు. కానీ ఒక అడుగు ముందుకు.. ఆరు అడుగులు వెనక్కు అన్న చందంగా తయారైంది బీఎన్ రోడ్డు అభివృద్ధి పరిస్థితి. పోలీసు అధికారులు స్పందించి వెంకన్నపాలెం- చోడవరం మధ్య తరచూ ట్రాఫిక్ స్తంభించే బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్ కల్వర్టు వద్ద, గోవాడ వంతెన వద్ద పోలీసులను ఏర్పాటు చేయాలని, పరిమితికి మించి చెరకు లోడుతో వచ్చే వాహనాలను నియంత్రించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏయూ వీసీ పోస్టుపై వీడని సస్పెన్స్

... 5వ పేజీ తరువాయి

భావిస్తున్నారని, ఝాన్సీ ఎంపీగా బరిలోకి దిగుతుండడంతో వీసీ నియామకంపై మంత్రి మరింతగా దృష్టిసారించే అవకాశముందంటున్నారు. ఈ నేపథ్యంలో మాజీ వీసీకి దాదాపు దారులు మూసుకుపోయినట్టేనంటున్నారు. మిగిలిన ఇద్దరిలో ఒకరికి ఎంపీ స్థానానికి ఖరారైన బొత్స ఝాన్సీ లక్ష్మీతో పరిచయం ఉందని, ఆమె ద్వారా ప్రయత్నాలు సాగిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సంక్రాంతి తరువాత ఏయూ వీసీ పోస్టు భర్తీపై సస్పెన్స్‌కు తెరపడుతుందని అంచనా వేస్తున్నారు. ఎన్నికల నిబంధనలు అమల్లోకి రాకముందే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఏయూ అధికారులు భావిస్తున్నారు. సెర్చ్ కమిటీ నివేదికలోని ముగ్గురిలో ఒకరికి కాకుండా, కొత్త వారికి అవకాశం ఇవ్వాలని భావిస్తే మాత్రం వీసీ నియామక ప్రక్రియ మళ్లీ మొదటికి వచ్చే అవకాశముందంటున్నారు. ఎన్నికల తరువాత ప్రక్రియ చేపట్టాలని భావిస్తే ప్రస్తుత ఇన్‌చార్జి వీసీనే కొనసాగించే అవకాశం ఉందంటున్నారు. మొత్తమ్మీద వీసీ ఎంపిక ప్రక్రియపై సంక్రాంతి తరువాతే స్పష్టత వచ్చే అవకాశముందని వర్సిటీ వర్గాలు చెబుతున్నాయి.

ఎస్మా జీవో ప్రతులు భోగి మంటల్లో దహనం



గొలుగొండలో భోగిమంటల్లో ఎస్మా ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

గొలుగొండ, జనవరి 14: వైసీపీ ప్రభుత్వం తమ సమ్మెపై జారీ చేసిన ఎస్మా జీవో ప్రతులను అంగన్‌వాడీలు ఆదివారం భోగిమంటల్లో దహనం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు అమలు చేసేవరకూ దీక్ష విరమించబోమని, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకురాలు మంగతాయారు మాట్లాడుతూ.. పనికి తగిన వేతనం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీల యూనియన్ నాయకులు భ్రమరాంబ, ఆర్. వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాలు సేకరణలో అంగన్‌వాడీలు

మాకవరపాలెం, జనవరి 14: అంగన్‌వాడీల సమ్మె భోగి రోజు కూడా కొనసాగింది. మండలంలో కొండలఅగ్రహారం, మాకవరపాలెం, తామరం, రాచపల్లి తదితర గ్రామాల్లో కోటి సంతకాలు సేకరణ కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. ప్రజల వద్దకు వెళ్లి తమ బాధలను చెబుతూ సంతకాల సేకరణ చేస్తున్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీల మండల అధ్యక్షురాలు మాట్లాడుతూ ప్రభుత్వం మొండివైఖరి విడనాడాలన్నారు. సమ్మె 34వ రోజుకు చేరినా ఇంతవరకూ ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. సమ్మె మరింత ఉధృతం చేస్తామని వారు తెలిపారు.

లక్ష్యాన్ని చేరే వరకు యువత కష్టపడి చదవాలి : కిలాడ సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న లకొనవ్ సీబీసీఐడీ ఏడీజీ కిల్లాడ సత్యనారాయణ

మాకవరపాలెం,జనవరి 14: లక్ష్యాన్ని చేరే వరకూ యువత కష్టపడి చదవాలని లకొనవ్ సీబీసీఐడీ ఏడీజీ కిల్లాడ సత్యానారాయణ అన్నారు. ఆదివారం కొండలఅగ్రహారంలోని ఇమ్మాన్యూయేలు సంస్థ ఏర్పాటు చేసిన నర్సింగ్ కాలేజీలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు నచ్చిన కోర్సుని ఎంచుకొని ఇష్టపడి చదవాలన్నారు. నర్సింగ్ కోర్సు ఎంతో విలువైనదనిఇ, సేవ చేసే అదృష్టం రావాలంటే ఈ కోర్సులో ఉన్నత శిఖరాలను అధిగమించవచ్చునన్నారు. అనంతరం ఆయనిన్ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధినేత జీవన్‌రాయ్, గేయిల్ సంస్థ చీఫ్ మేనేజర్ ఎల్.సంజీవ్‌రావు, జ్యోతిరావుఫూలే ఆలిండియా ఓబీసీ ప్రెసిడెంట్ పోతల ప్రసాద్‌నాయుడు పాల్గొన్నారు.

చోడవరం
నియోజకవర్గం

గోవాడలో క్రషింగ్‌కు అంతరాయం

చోడవరం, జనవరి 14: గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో ఆదివారం తెల్లవారు జాము నుంచి క్రషింగ్‌కు అంతరాయం ఏర్పడింది. తెల్లవారు 2 గంటల సమయంలో బాయిలర్ హౌస్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో క్రషింగ్‌కు బ్రేక్ పడింది. సాంకేతిక సమస్యను సరిదిద్దే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. ఆదివారం సాయంత్రానికి కూడా పనులు కొనసాగుతుండడంతో రాత్రికి తిరిగి క్రషింగ్ మొదలయ్యే అవకాశం ఉందని సమాచారం.

రైతు సంఘం నిరసన

చోడవరం, జనవరి 14: జీవో నంబరు-27తో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, రెవెన్యూ అధికారుల అసమగ్ర సర్వే వల్ల నష్టపోయే ప్రమాదం ఉందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు అన్నారు. స్థానిక పాత బస్టాండ్ వద్ద ఆదివారం భోగి మంటల్లో జీవో 27 ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు కీడు చేసే జీవోలను ప్రభుత్వం బలవంతంగా రుద్దే ప్రయత్నాలు మానుకోకపోతే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కామిరెడ్డి నారాయణమూర్తి, విస్సారపు నాగూరు. శ్రీను, బాబు, నాగబాబు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తూర్పు కాపు సంఘం మండల అధ్యక్షుడిగా నానాజీ

బుచ్చెయ్యపేట, జనవరి 14: తూర్పు కాపు సంక్షేమ మండల అధ్యక్షుడిగా వీర్ల నానాజీ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం జిల్లా అధ్యక్షుడు కరణం శ్రీహరి నానాజీకి నియామకపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా నానాజీ మాట్లాడుతూ, గ్రామ కమిటీ నియామకాల ద్వారా సంఘం బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

ఘనంగా గోదా కల్యాణం

బుచ్చెయ్యపేట, జనవరి 14: ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా చివరి రోజు ఆదివారం వడ్డాది గిరిజాంబగిరిపై వేద పండితులు శాస్త్రోయుక్తంగా గోదా రంగనాయక స్వామి వార్ల కల్యాణం జరిగింది. నెల రోజులుగా అత్యంత భక్తిశ్రద్ధలతో ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. కల్యాణంలో విశేష సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

సంక్రాంతి ముగ్గులతో అంగన్‌వాడీల నిరసన



చోడవరంలో భోగి మంటల వద్ద సంక్రాంతి ముగ్గులు

చోడవరం, జనవరి 14: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న యూనియన్ ప్రతినిధులు తెలిపారు. చోడవరం పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కార్యకర్తల శిబిరం వద్ద కార్యకర్తలు సంక్రాంతి ముగ్గులు వేసి తమ నిరసన తెలిపారు. పండగ పూట ఆడపిల్లలను ఇబ్బందులకు గురిచేస్తున్న జగన్ సర్కారుకు కార్యకర్తలు శాపనార్థాలు పెట్టారు. అనంతరం భోగి మంట వేసి షోకాజ్ నోటీసుల ప్రతులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుడు ఎస్.వీ.నాయుడు అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం నాయకులు కొండమ్మ, సూర్యకాంతం, జగదీశ్వరి, కృష్ణవేణి, కాంతం,. శ్రీదేవి,. పూర్ణ తదితరులు పాల్గొన్నారు.





రావికమతంలో సంప్రదాయ పద్ధతిలో భోగి వేడుకలు... చీడికాడలో వేసిన భోగి మంటలు

వాడవాడలా భోగి వేడుకలు



దేవరాపల్లిలో ఎంపీపీ రాజేశ్వరి ఇంటి వద్ద భోగి మంటలు

చోడవరం/బుచ్చెయ్యపేట/రోలుగుంట/చీడికాడ/రావికమతం/దేవరాపల్లి/మాడుగుల రూరల్, జనవరి 14: భోగి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోని మండలాలాల్లో వాడవాడలా భోగి మంటలు వేశారు. తెల్లవారు జామున అన్ని చోట్లా భోగిస్నానాలతో చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ సందడి చేశారు. భోగి మంటల వద్ద సంప్రదాయ వస్త్రధారణలతో భక్తులు పాల్గొని భక్తిని చాటుకున్నారు. చోడవరం మండలంలోని గోవాడలో గ్రామంలో భోగి వేడుకలను సంప్రదాయ పద్ధతుల్లో జరుపుకున్నారు. అలాగే ప్రభుత్వ విప్ ధర్మశ్రీ కుటుంబ సభ్యులతో కలిసి గాజువాకలోని నివాసం వద్ద భోగి మంట వద్ద సందడి చేశారు. బుచ్చెయ్యపేట మండలంలో భోగి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. వయోబేధానికి అతీతంగా కుటుంబ సభ్యులతో మంటల్లో ఆవు పిడకలు, పాత చెక్క సామగ్రి వేశారు. రావికమతం మండలంలోని భోగి పండుగను భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. తెల్లవారుజామున 3 గంటల నుంచే గ్రామాలు కళకళలాడాయి. రోలుగుంట మండలంలోని రోలుగుంట, కొండపాలెం, కొమరవోలు, కొవ్వూరు, రత్నంపేట, బుచ్చెంపేట, వడ్డిప తదితర గ్రామాల్లో భోగి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొండపాలెంలో సర్పంచ్ బంటు లక్ష్మి, చిరంజీవి ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. అలాగే కొమరవోలులో స్థానిక యువత వివిధ వేషదారణలను ధరించి పురవీధుల్లో ఊరేగింపుగా భోగి వేడుకలను నిర్వహించారు. మాడుగుల మండలంలోని వీధుల్లో యువకులు భోగి మంటలు వేశారు. చిన్నారులు పేడతో తయారు చేసిన పిడకల దండలు తెచ్చి మంటల్లో వేశారు. ఎక్కడ చూసినా సంక్రాంతి పండగ సందడి కనిపించింది. దేవరాపల్లి మండలం తారువ గ్రామంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు భోగి మంటలు వేశారు. అనంతరం రామాలయంలో పూజలు చేసి యువకులంతా సందడి చేశారు. పల్లెల్లో భక్తిశ్రద్ధలతో భోగి మంటలు వేశారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరీ, భాస్కరరావు ఇంటి వద్ద భోగి మంటలు వేశారు.

సైకో పాలనతో విసిగిన ప్రజలు

» టీడీపీ చోడవరం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు

» భోగి మంటల్లో రైతు వ్యతిరేక జీవో పత్రులు



భోగి మంటల్లో ప్రజా, రైతు వ్యతిరేక జీవో ప్రతులను దహనం చేస్తున్న తాతయ్యబాబు, నాయకులు

బుచ్చెయ్యపేట, జనవరి 14: సైకో పాలనపై ప్రజలు విసిగిపోయారని, రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వస్తాయా అని ఎదురుచూస్తున్నారని టీడీపీ చోడవరం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు చెప్పారు. బంగారుమెట్ట కూడలిలో ఏర్పాటు చేసిన భోగి మంటల్లో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ప్రజా, రైతు వ్యతిరేక జీవో ప్రతులను టీడీపీ శ్రేణులతో కలిసి వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తాతయ్యబాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ప్రచార ఆర్భాటమే తప్ప రైతులను ఆదుకున్న దాఖలాలు లేవని విమర్శించారు. టీడీపీ అమలు చేసిన రైతు రుణమాఫీని జగన్ సర్కారు రద్దు చేయడం దారుణమన్నారు. వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు బిగించడం, రూ.3 లక్షలలోపు సున్నా వడ్డీ రుణాలకు రూ.లక్షకే పరిమితం చేయడం, అది రైతులు ముందుగా వడ్డీ చెల్లించేలా జీవో జారీ చేయడం అన్యాయమని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపడమే లక్ష్యంగా టీడీపీ, జనసేన పార్టీ కార్యకర్తలు, నాయకులు పని చేయాలని పిలుపునిచ్చారు. వైసీపీ మరోసారి అధికారంలోకి వస్తే ఏపీ అంధకారమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా వ్యతిరేక పాలనతో పబ్బం గుడుపుకుంటున్న వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని తాతయ్యబాబు చెప్పారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.శ్రీరామ్మూర్తి, మండల అధ్యక్షుడు గోకివాడ కోటేశ్వరరావు, నాయకులు దొండా నరేష్, దొంకిన అప్పలనాయుడు, సాయం శేషు, దొండా శ్రీను, టి.సింహాద్రిప్పడు, దొండా రమేష్, సింగంపల్లి రమేష్, ముచ్చకర్ల తాతయ్యలు, దొడ్డి కిశోర్, దొండా గిరిబాబు, గంగరాజు పాల్గొన్నారు.

వడ్డాది సంతలో నాటు కోళ్లకు గిరాకీ



వడ్డాదిలో నాటుకోళ్లు కొనడానికి వచ్చిన ప్రజలు

బుచ్చెయ్యపేట, జనవరి 14: వడ్డాదిలో ఆదివారం జరిగిన సంతలో నాటుకోళ్లకు గిరాకీ ఏర్పడింది. బుచ్చెయ్యపేటతో పాటు చోడవరం, మాడుగుల, రావికమతం మండలాల నుంచి ప్రజలు నాటుకోళ్లకు ఎగపడడంతో గిరాకీ ఏర్పడింది. సాధరణంగా రూ.1000 నుంచి రూ.2 వేలు మధ్య పలికే నాటు కోడి ధర, రూ.1500 నుంచి రూ.5 వేల వరకు వెళ్లింది. గత ఏడాదితో పోలిస్తే ధరలు అధికంగా ఉన్నప్పటికీ, కొనుగోలుకు ప్రజలు ఏమాత్రం వెనకాడలేదు.

మాడుగుల
నియోజకవర్గం

ఏపీకి పట్టిన కీడు తొలగాలి

» మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు

చీడికాడ, జనవరి 14: ఐదేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌కు పట్టిన కీడు తొలగిపోయి రాష్ట్రం స్వర్ణ యుగానికి సంక్రాంతి పండుగ నాంది కావాలని మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు ఆకాంక్షించారు. మండలంలోని జి.కొత్తపల్లి గ్రామంలో ఆదివారం భోగి మంటల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అవినీతి, అక్రమాలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కేందుకు జారీ చేసిన జీవోలను భోగి మంటల్లో వేసి దహనం చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతల చిన్నంనాయుడు, బొబ్బాది తాతారావు, నాయకులు గండి ముసలినాయుడు, పైల ముత్యాలనాయుడు, బీశెట్ల కోటేశ్వరరావు, ప్రసాద్, డోకల అక్కునాయుడు, డోకల సింగపూర్‌దేముడుబాబు, అమ్మతల్లినాయుడు, ప్రసాద్, బండారు దయాకర్, శరగడం శివ, కొల్లి సూరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో పశువులకు గాయాలు

దేవరాపల్లి, జనవరి 14: మండలంలోని తారువలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పశువులు తీవ్రంగా గాయపడ్డాయి. గ్రామానికి చెందిన గుల్లిపల్లి రమణ చెందిన పశువుల పాక కాలిపోయింది. దీంతో రెండు పాడి గేదెలు తీవ్రంగా గాయపడ్డాయి. మామిడిపల్లి పశు వైద్యాధికారి జి.ప్రియాంక వైద్య సేవలు అందించారు.

రెండు గ్రామాల్లో అభివృద్ధి పనులు డిప్యూటీ సీఎం ప్రారంభోత్సవం

కె.కోటపాడు, జనవరి 14: మండలంలోని గొట్లాం, సూదివలస గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు ఉప ముఖ్య మంత్రి బూడి ముత్యాలనాయుడు ఆదివారం ప్రారంభోత్సవం చేశారు. గొట్లాం గ్రామంలో రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, సూదివలస గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, జలజీవన్ మిషన్ ద్వారా రూ.61 లక్షల ఏర్పాటు చేసిన ఇంటింట కొళాయి ప్రారంభించారు. అలాగే కిలపర్తి నాయుడు సమకూర్చిన చీరలను ఆయన పంపిణీ చేశారు. ఎంపీపీ ఈ కార్యక్రమాల్లో నాయకులు రెడ్డి జగన్మోహన్, జెడ్పీటీసీ అనూరాధ, ఆదిరెడ్డి సన్యాసినాయుడు, వర్రి రామునాయుడు పాల్గొన్నారు

భోగి మంటల్లో షోకాజ్ నోటీసులు

» వినూత్నంగా అంగన్‌వాడీల నిరసన



భోగి మంటల్లో షోకాజ్ నోటీసులు వేస్తున్న అంగన్‌వాడీలు

చీడికాడ/దేవరాపల్లి, జనవరి 14: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు చేపట్టి సమ్మె కొనసాగుతోంది. ఇందులో భాగంగా ప్రభుత్వం వారికి జారీ చేసిన షోకాజ్ నోటీసులను సోమవారం చీడికాడ, దేవరాపల్లి మండలాల్లో భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అలాగే దేవరాపల్లిలో సంక్రాంతి ముగ్గులు వేసి నిరసన తెలిపారు. ఆడపడుచులను పండగ పూట పస్తులు ఉంచడం జగనన్నకు ధర్మమేనా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమాల్లో సీఐటీయూ మండల కార్యదర్శి రొంగలి దేముడునాయుడు, సంఘం నాయకులు మేడపురెడ్డి జానకి, ఉమాదేవి, రామలక్ష్మి, పరవాడ నిర్మల, జి.వరలక్ష్మి, పద్మ, సన్యాసమ్మ, గౌరి, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.